సాక్షి ప్రకాశం
ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



నైపుణ్యాలు పెంపొందించాలి

ఇగ్నైట్ యంగ్ మైండ్స్ విద్యార్థుల నైపుణ్యాలు, సృజనాత్మకత, విజ్ఞానం వెలికితీసేందుకు ఉపయోగపడుతోందని కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు.

- 8లో..



జవాబుదారీ పాలన అందిస్తున్న జగనన్న

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జవాబుదారీ పాలన అందిస్తున్నారని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35.3/25

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో 2024-25 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ సుభమహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ +మాథ్స్, గణితం లేకుండా సైన్స్, కోర్సుల్లో ప్రవేశానికి ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల నుంచి ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే ధృవపరిచిన అనంతరం ఆన్‌లైన్‌లో అక్టోబరు 31వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2024 ఫిబ్రవరి 10వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

కార్డు-2.0తో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు సులభతరం

- జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర

పొదిలి: కార్డు-2.0తో దస్తావేజుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సులభతరమవుతుందని, కేవలం 20 నిముషాల వ్యవధిలో పని పూర్తవుతుందని జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. తొలుత కార్యాలయంలోని రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ 2.0 విధానం ద్వారా రిజిస్టర్ అయిన డాక్యుమెంట్లు ఆటోమేటిక్‌గా మ్యూటేషన్ అవుతాయన్నారు. వారం పది రోజుల వ్యవధిలోనే మ్యూటేషన్ పూర్తవుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టగా, అన్ని ప్రాంతాల్లో విజయవంతమైందని చెప్పారు. ప్రజలకు సులభతరమైన ఈ విధానం త్వరలో రాష్ట్రం మొత్తం అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి అపోహలు అవసరం లేదని, అరగంట వ్యవధిలో రిజిస్ట్రేషన్ ఒరిజనల్ పత్రాలు పొందవచ్చన్నారు. ఆయన వెంట సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ ఉన్నారు.

ప్రపంచవర్సిటీల్లో పేదింటి బిడ్డలు

తండా టూ జర్మనీ...

పుల్లల చెరువు మండలం సుద్దకురువ గిరిజన తండా నుంచి బనావత్ పవన్‌కుమార్ నాయక్ జర్మనీలో ఉన్నత చదువులు చదివేందుకు అర్హత సాధించాడు. తండ్రి వెంకటేశ్వర్లు నాయక్ రైతు. తనకున్న 35 సెంట్లతో పాటు, ఐదు ఎకరాలు కౌలు తీసుకుని మిర్చి, పత్తి సాగు చేశాడు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కరువు కరాళ నృత్యం చేయడంతో తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేక 2018లో ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోలేదు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ హయాంలో ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ఆ కుటుంబం ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కింది. ఇక పవన్‌కుమార్ చిన్ననాటి నుంచి చదువులో ప్రతిభ కనబరుస్తూనే ఉన్నాడు. భర్త ఆత్మహత్య చేసుకున్నా కొడుకు ఆసక్తి గమనించిన తల్లి పద్మావతి కూలి పనులు చేసుకుంటూ చదివిస్తూ వస్తోంది. పవన్‌కుమార్ కూడా చదువుపై దృష్టిని లగ్నం చేశాడు. జగనన్న విదేశీ విద్యా దీవెనకు ఎంపికై జర్మనీలో చదువుకుంటున్నాడు. వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం పవన్‌కుమార్ తల్లికి ఇంటి పట్టా ఇచ్చి సొంత ఇంటి కలను కూడా నెరవేర్చింది. అదే విధంగా ప్రభుత్వం నుంచి ఆమెకు ప్రతి నెలా వితంతు పెన్షన్ రూ.2,750 ఇచ్చి ఆదుకుంటోంది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో పంటలు పండక అప్పుల పాలయ్యామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తమ కుటుంబాన్ని ఆదుకున్నారని, నా బిడ్డను జర్మనీ పంపించి చదివిస్తున్నారని కన్నీటి పర్యంతమైంది .



జర్మనీలోని కొట్టింగన్ సిటీలో బనావత్ పవన్ కుమార్ నాయక్

ప్రపంచంలోని అత్యున్నత శ్రేణి విద్యాసంస్థల్లో ఉన్నత విద్య. ఇది ప్రతి విద్యార్థి కల..ప్రతిభ గల పేద విద్యార్థులకు ఇది నెరవేరని స్వప్నం..రూ. లక్షలు వెచ్చించి చదువుకోలేక ఎందరో ప్రతిభావంతులు అవకాశాల్ని వదులుకున్న పరిస్థితులు.. ఇది ఒకప్పుడు..అత్యంత సంపన్నులు చదువుతున్న ఆ విశ్వవిద్యాలయాల్లో మన పేద విద్యార్థులు అడుగుపెట్టి సత్తా చాటేలా వెన్నుదన్నుగా నిలుస్తోంది రాష్ట్ర ప్రభుత్వం..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న విదేశీ విద్యా దీవెన' సరస్వతీ పుత్రులకు వరంగా మారింది. జిల్లాకు చెందిన నిరుపేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసిస్తూ సుందర స్వప్నాన్ని సాకారం చేసుకుంటున్నారు..



సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా జగనన్న విదేశీ విద్యాదీవెన చెక్కు తీసుకుంటున్న విద్యార్థులు, సర్కిల్‌లో బనావత్ పవన్ కుమార్ నాయిక్ (ఫైల్)



కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా విదేశీ విద్యా దీవెన చెక్కు తీసుకుంటున్న విద్యార్థులు, సర్కిల్‌లో నరాల అనుదీప్ రెడ్డి (ఫైల్)

- పేద పిల్లలు...పెద్ద చదువులు
- జగనన్న విదేశీ విద్యా దీవెనతో విద్యా వెలుగులు
- ఇప్పటి వరకు జిల్లాలో 21 మందికి అవకాశం
- విదేశాల్లోని టాప్ వర్సిటీల్లో జిల్లా విద్యార్థుల సత్తా
- తపన ఉన్న వారికి అండగా ఫీజు రీయింబర్స్‌మెంట్
- మొదటి విడతగా రూ.2.47 కోట్లు నేరుగా విద్యార్థుల అకౌంట్లలో జమ
- టీడీపీ హయాంలో ఒక్కొక్కరికి రూ.15 లక్షలు సీలింగ్
- అది కూడా రిజర్వేషన్ ఉన్న వారికి మాత్రమే వర్తించేలా చంద్రబాబు నిర్ణయం
- ప్రతిభే అర్హతగా సాయం అందిస్తున్న జగన్ సర్కార్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రతిభ గల పేద విద్యార్థులు ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీల్లో చదుకుకొని ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తంగా చాటాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలంచారు. అందుకోసం మన పేద పిల్లలు కూడా సంపన్నులతో సమానంగా విదేశీ విద్యను సముపార్జించుకోవాలని 'జగనన్న విదేశీ విద్యా దీవెన' అన్న బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. మన పేద పిల్లలు డబ్బులేక ఉన్నత చదువులు, విదేశాల్లోని గొప్ప యూనివర్సిటీల్లో చదువుకోలేక పోతున్నామన్న నిరాశ, నిస్పృహలు ఉండకూడదన్న ఒకే ఒక్క ఆలోచన... ఇది జిల్లాలోని ప్రతిభ కలిగిన పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారు, అగ్రవర్ణాల్లోని నిరుపేదలు ఉన్నత చదువులు, విదేశీ చదువులు కొనసాగించేందుకు దోహదపడింది. విదేశాల్లోని టాప్ 200 యూనివర్సిటీల్లో ప్రతిభ ఆధారంగా సీటు సంపాదించుకోగలిగితే చాలు అందుకు అవసరమైన పూర్తిస్థాయి ఫీజులు, చదువుకు అవసరమైన ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కేవలం రూ. 15 లక్షలు చెల్లించి చేతులు దులుపుకుంది. అయితే ప్రతిభ ఉండి ఉన్నత చదువులు చదువుకోవాలన్న తపన ఉన్న వారందరికీ అవకాశం కల్పించారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అవకాశం కల్పించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని విదేశీ వర్సిటీల్లో సీట్లు సంపాదించుకుంటున్న వారు విమానాలు ఎక్కి విదేశాల్లో చదువుకుంటూ తమ కల నెరవేర్చుకుంటున్నారు.



పట్టా ఇచ్చి ప్రభుత్వమే నిర్మించి ఇచ్చిన సొంతింటి వద్ద పవన్ కుమార్ తల్లి పద్మావతి

జిల్లా నుంచి 21 మంది ఆర్థిక సాయం...

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో భాగంగా 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో జిల్లా నుంచి మొత్తం 21 మంది ఎంపికయ్యారు. ప్రభుత్వం నుంచి సాయం అందుకున్న వీరు విద్యను అభ్యసిస్తున్నారు. అందుకుగాను మొదటి విడతగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2.47 కోట్లు నేరుగా విద్యార్థుల బ్యాంకు అకౌంట్లలో జమ చేసింది. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో భాగంగా ట్యూషన్ ఫీజు, ప్రయాణ ఖర్చులు, వీసా చార్జీలు కూడా ప్రభుత్వమే భరిస్తోంది. ఇలాంటి ఖర్చులన్నీ కలిపి ఈ 21 మందికి మొత్తం రూ.4.05 కోట్ల మేర ప్రభుత్వం ప్రయోజనం కల్పిస్తోంది.

21 రకాల కోర్సులు చేసేందుకు వీలుగా...

విదేశాల్లో మొత్తం 21 రకాల ఉన్నత విద్యా కోర్సులు చేసేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అందులో ఎంబీబీఎస్, పీజీ, ఎం.ఎస్, ఎంబీఏ, కంప్యూటర్ ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు మొత్తం 21 రకాల కోర్సులకు అవకాశం కల్పించింది. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా(యూఎస్‌ఏ)తో పాటు యూకే, జర్మనీ, ఇటలీ, ఖజికిస్తాన్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో మన పేద పిల్లలు చదువుకునే మహా భాగ్యం కలిగింది. ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వ విద్యలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సర్కార్ బడులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి భారతదేశంలోనే ఒక పెద్ద ప్రయోగానికి తెరలేపారు. చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్న ఒకే ఒక్క నినాదంతో తన పరిపాలనను ముందుకు తీసుకుపోతున్నాడు.

ప్రతిభకు పట్టం..



జాన్ హోప్‌కిన్స్ యూనివర్సిటీ స్టూడెంట్ గుర్తింపు కార్డు పొందిన నరాల అనుదీప్ రెడ్డి

ఒంగోలు నగరానికి చెందిన మాలతీ శ్రీదేవి, నరాల రమణారెడ్డిల కుమారుడు అనుదీప్‌రెడ్డి. విద్యపై ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు అతన్ని ఉన్నత విద్యవైపు అడుగులు వేయించారు. పదో తరగతి వరకూ ఒంగోలులో చదివాడు. ఆ తర్వాత ఇంటర్ విజయవాడలో, వేలూరు విట్‌లో బీఈ(ఈఈఈ) పూర్తి చేశాడు. అమెరికాలోని టాప్ యూనివర్సిటీ మేరీల్యాండ్ స్టేట్‌లోని బాల్టిమోర్ సిటీలో ఉన్న జాన్ హోప్ కిన్స్ యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించాడు. ప్రభుత్వం అమలు చేస్తున్న విదేశీ విద్యాదీవెన పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. టాప్ వర్సిటీలో సీటు సాధించడంతో అతనికి సంబంధించి ట్యూషన్ ఫీజుతో పాటు అన్నిరకాల ఖర్చులు సుమారు రూ.1.03 కోట్లు ప్రభుత్వమే భరించి ఉన్నత విద్యాభ్యాసానికి అమెరికా పంపించింది. దీంతో తమ కల నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అనుదీప్, అతని తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలుపుతున్నారు.



తల్లిదండ్రులు నరాల మాలతీ శ్రీదేవి, రమణా రెడ్డితో అనుదీప్ రెడ్డి

విదేశీ విద్యకు ప్రభుత్వం ఎంతైనా ఖర్చు చేసి ప్రోత్సహిస్తోంది



ప్రతిభ ఉన్న పేద విద్యార్థులను చదివించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. డబ్బు లేదని పేద విద్యార్థులు విదేశీ విద్యకు దూరం కాకూడదని సీఎం మంచి సంకల్పంతో ముందుకు పోతున్నారు. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ కూడా అత్యంత పారదర్శకంగా ప్రతిభ ఉన్న పేద విద్యార్థులను విదేశీ విద్యా దీవెనకు ప్రోత్సహిస్తున్నారు. ఈ రెండు విద్యా సంవత్సరాల్లో జిల్లా నుంచి 21 మందిని విదేశాలకు పంపించాం. వచ్చే ఏడాది నుంచి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

- ఎస్.లక్ష్మానాయక్, డీడీ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఒంగోలులో జగనన్న మహిళా మార్ట్ ప్రారంభం
- మహిళా మాల్‌గా ఎదగాలన్న మంత్రి ఆదిమూలపు సురేష్
- కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎంపీ మాగుంట, మేయర్



మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట, మేయర్ గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు సబర్బన్: మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నగరంలోని కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా స్వశక్తి భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, మేయర్ గంగాడ సుజాతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నగరంలో జగనన్న మహిళా మార్ట్‌ను ప్రారంభించటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మహిళా మార్ట్ ఏర్పాటు కోసం అధికారులు తనను కలిసినప్పుడు వెంటనే మార్ట్ భవన పునర్ నిర్మాణం కోసం సీఎం డెవలప్‌మెంట్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించానన్నారు. మహిళలను అండగా ఉండేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పథకంలోనూ వారికి ప్రత్యేక స్థానం కల్పిస్తున్నారన్నారు. ఇళ్ల స్థలాలు మొదలు చేయూత, ఆసరా, జగనన్న అమ్మఒడి పథకంతో పాటు అనేక రకాల పథకాలు మహిళలకే అందించి వారి కుటుంబాలు సంతోషంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మహిళలకు వ్యాపార నైపుణ్యాలు పెంపొందించి సుస్థిర జీవనోపాధి కల్పించాలన్న ధ్యేయంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళా మార్ట్‌లను నెలకొల్పారన్నారు. ఈ మార్ట్‌ల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులకు మార్కెట్ కల్పిస్తున్నామన్నారు. ఎక్కడా దొరకని వస్తువులు కూడా ఈ మార్ట్‌లో దొరుకుతాయనే నమ్మకం ప్రజల్లో కలిగేలా అభివృద్ధి చేయాలని నిర్వాహకులకు సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో 2023 సెప్టెంబర్ నాటికి 4,490 సంఘాలు ఉన్నాయని, అందులో మొత్తం 43,786 మంది సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. ఇందులో 33,731 మంది సభ్యులు రూ.150 చొప్పున పెట్టుబడితో మొత్తం రూ.50,63,650 కార్పస్ ఫండ్ చెల్లించారన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఎదుగుదలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఒంగోలులో జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. మహిళలకు జీవనోపాధి కల్పించి ఆర్థికగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ మార్ట్‌కు రూపకల్పన చేశామన్నారు. పట్టణ సమాఖ్యల పరిధిలోని స్వయం సహాయక సంఘ సభ్యులు ఒక్కొక్కరు కనీసం రూ.150 పెట్టుబడితో సంఘ సభ్యులంతా వాటాదారులుగా, నిర్వాహకులుగా, కొనుగోలుదారులుగా మార్ట్‌ను నిర్వహించుకోవాలన్నారు. రాష్ట్ర మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసిందన్నారు. మెప్మా పీడీ తేళ్ల రవి కుమార్, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఒడా చైర్మన్ సింగరాజు మీనా కుమారి వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: షెడ్యూల్ క్యాస్ట్ ప్రజలు అధికంగా నివసించే గ్రామాల్లో అన్ని ప్రాథమిక మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం అమలవుతున్న తీరుపై శనివారం ప్రకాశంభవనంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత గ్రామాల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు సామాజిక ఆర్థిక అంతరాలను తొలగించేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, సామాజిక భద్రత, గ్రామీణ రోడ్లు, హౌసింగ్, విద్యుత్, వ్యవసాయ, వృత్తి నైపుణ్యం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు విడతల్లో ప్రస్తుత ప్రకాశం జిల్లాలో 99 గ్రామాలను ఈ పథకం కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో 500 పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ మాధురి, డీఈఓ సుబ్బారావు, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ సురేష్, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, హౌసింగ్ పీడీ పేరయ్య, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

● కలెక్టర్ దినేష్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ప్రభుత్వ విద్యార్థుల నైపుణ్యాలు, సృజనాత్మకత, విజ్ఞానం వెలికితీసేందుకు ఉపయోగపడుతోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. శనివారం మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మానసపుత్రిక.. ఇగ్నైట్ యంగ్ మైండ్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ప్రభుత్వ విద్యార్థులకు ఎస్ఏ, క్విజ్, ఫోక్ డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులుగా సమాజానికి సేవ చేసే విధంగా వారి లక్ష్యాలు ఉండాలని కోరారు. 8,9,10 తరగతుల నుంచే గొప్ప అవకాశాల గురించి ఆలోచిస్తూ ఉపాధ్యాయుల సహకారంతో మంచి భవిష్యత్ చేరుకోవాలన్నారు. ఎస్ఏ రైటింగ్ విభాగంలో సివిల్ సర్వీస్‌లో ఇచ్చే ప్రశ్నలుగా ఉన్నాయని ఆయన గుర్తు చేసుకున్నారు.

భవిష్యత్‌లో రాణించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని, బాగా చదివి భవిష్యత్తులో తాము కోరుకున్న రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద, విదేశీ విద్య వంటి పథకాలతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాడు-నేడు ద్వారా మౌలిక వసతులను కల్పించి విద్యను అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సహకారంతో సీఎం జీఎఫ్ నిధులు రూ. 6 లక్షలకు మ్యాచింగ్ గ్రాంటు కింద జెడ్పీ నుంచి రూ. 12 లక్షలతో నిర్మించిన ఓపెన్ డయాస్ నిర్మాణాన్ని ఆమె ప్రారంభించారు.

అభినందనీయం

ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ఇగ్నైట్ యంగ్‌మైండ్స్ ద్వారా జిల్లాలోని విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకు పలు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఈ పోటీలకు తీసుకురావడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందుకనుగుణంగా వారిని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 45 ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, ఒక్కో శాఖ నుంచి నెలలో ఒక రోజు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తమ శాఖల ద్వారా ప్రజలకు అందించే సర్వీసును వివరించినట్లయితే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్‌ను కోరారు. విజయవంతం చేసినందుకు విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను అభినందించారు. సబ్‌కలెక్టర్ సేదు మాధవన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థుల్లో నైపుణ్యాలున్నాయని వాటిని వెలికితీసి ప్రతిభావంతులుగా చేస్తున్న కృషిలో భాగంగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విజయవంతమయ్యారని అభినందించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, డిప్యూటీ ఈఓ చంద్రమౌళీశ్వర్, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, ఎంఈఓలు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జవాబుదారీ పాలన అందిస్తున్న జగనన్న



బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

● ఊచలు లెక్కబెడుతున్న చంద్రబాబు
● మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ పాలన అందిస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. శనివారం గురిజేపల్లిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాల అమలు గురించి క్యాలెండర్ విడుదల చేసి కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రజలు తమకు కావాల్సిన అవసరాలను చెప్పుకుంటుంటే నిలదీస్తున్నారంటూ.. ఎల్లో మీడియా పనికట్టుకొని ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. 2014 నుంచి అధికారంలో ఉన్న నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడంతో పాటు రూ. 371 కోట్ల స్కిల్ నిధులను దిగమింగారని, దీనివలన పరిశ్రమలు ఏర్పాటు కాలేదన్నారు. యువత నిరుద్యోగులుగానే మిగిలి పోయే విధంగా చేశారని విమర్శించారు. ప్రజా సమస్యల గురించి చర్చించాల్సిన శాసనసభలో మీసాలు తిప్పడం, పేపర్లు చింపి గౌరవ స్పీకర్‌పై విసరడం, ఈలలు వేయడం లాంటి చర్యలకు టీడీపీ ఎమ్మెల్యేలు పాల్పడటం శోచనీయమన్నారు.

వ్యవసాయానికి అండ జగనన్న

వైఎస్సార్ రైతు భరోసా వ్యవసాయానికి అండగా ఉండేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేస్తున్నారని మంత్రి అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని, అప్పుల బాధతో అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 2019 ప్రారంభం నుంచే జగనన్న నేతృత్వంలో రాష్ట్రంలోని రైతులు వ్యవసాయాన్ని పండగ చేసుకుంటున్నారని తెలిపారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వివిధ విభాగాల నేతలు ఒంగోలు మూర్తిరెడ్డి, కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, సయ్యద్ షాబీర్ బాష, సయ్యద్ జబీవుల్లా, ఐవీ సుబ్బారావు, సర్పంచ్‌లు ఫిలిప్, సత్తిరెడ్డి, ముసలారెడ్డి, ఎంపీటీసీ ఎన్. నాసరయ్య పలువురు అధికారులు పాల్గొన్నారు.

తెలుగు చిత్ర సీమలో ఏఎన్ఆర్ వేగు చుక్క



అక్కినేని జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయితల సంఘం

ఒంగోలు మెట్రో: తెలుగు చిత్ర సీమలో నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావుది చెరిగిపోని అధ్యాయమని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్ రచించిన నట సామ్రాట్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అక్కినేని నాగేశ్వర రావు అనేక పాత్రలకి జీవం పోసి ఆపాత్రలకు ప్రాణ ప్రతిష్ట చేశారన్నారు. ఆయన నటించిన విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, దేవదాసు, మహాకవి, కాళిదాసు, జయభేరి, ప్రేమనగర్, ప్రేమాభిషేకం, తదితర చిత్రాల్లో ఆయన నటన అజరామరమని కొనియాడారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలుగు చిత్ర సీమలో ఏఎన్ఆర్ వేగుచుక్క లాంటి వాడన్నారు. తెలుగు చిత్ర సీమను తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు తరలించి ఎందరో సినీ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ నటుడుగా ఆయన చరిత్రను సృష్టించడమే కాకుండా అక్కినేని ఆలోచనలు (అఆ)పేరుతో సాహితీ లోకానికి ఆయన అనుభవాలను అందించి చిరస్మరణీయుడయ్యాడని తెలిపారు. పుస్తక రచయిత షేక్ మహబూబ్ జాన్ మాట్లాడుతూ అక్కినేని శతజయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్ర రాసే అవకాశం తనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, ప్రముఖ రచయిత సయ్యద్ సాబీర్ హుస్సేన్, అక్కినేని అభిమాని సలార్, ముస్లిం రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి హుమయూన్ బాషా పాల్గొన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

● వేస్ట్ పిక్కర్స్, సంచార జాతులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఒంగోలు సెంట్రల్: చెత్త పేపర్లు సేకరించే వారు (వేస్ట్ పిక్కర్స్), సంచార జాతులు ప్రభుత్వ పథకాలు, బీమా సౌకర్యాల పట్ల అవగాహన కలిగి ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ పవన్‌కుమార్ కోరారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో శనివారం ఒంగోలు డీబీఆర్సీ ఆధ్వర్యంలో వేస్ట్ పిక్కర్స్, సంచార జాతులకు డీబీఆర్సీ సీటీ కోఆర్డినేటర్ గుత్తి కోటేశ్వరరావు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ పవన్‌కుమార్ మాట్లాడారు. కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను వివరించారు. లేబర్ కార్డులు, ఈ-శ్రమ కార్డులు, బీమా వంటి పథకాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలకు తెలిపేందుకు డీబీఆర్సీ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరికీ విషయం తెలిపి ఆయా పథకాల్లో నమోదు అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. డీబీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, గుంటూరు నాగమణి పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



సింహాద్రి మృతదేహం

ఒంగోలు టౌన్: నగరంలోని ఆర్టీసీ బస్సు డిపో వద్ద అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందాడు. కొండపి మండలం నేతివారిపాలెం గ్రామానికి చెందిన జరుగుమల్లి సింహాద్రి శుక్రవారం రాత్రి రెండు గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండుకు వచ్చాడు. ఇన్‌కమింగ్ వైపున ఉన్న ఖాళీ స్థలంలో నిద్రపోతూ మరణించాడు. తెల్లవారుజామున పోలీసు ఔట్‌పోస్టు సిబ్బంది గమనించి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తెలియజేయగా వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

నేడు సింగరాయకొండలో వందేభారత్

సింగరాయకొండ: రైల్వే శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన విజయవాడ-చెన్నై వందేభారత్ రైలు ప్రజల చూసేందుకు వీలుగా ఆదివారం సింగరాయకొండ రైల్వేస్టేషన్ ఆగనుంది. నూతనంగా ప్రారంభమవుతున్న ఈ రైలు విజయవాడలో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలు దేరి సుమారు 3 గంటల సమయంలో రైల్వేస్టేషన్ లో ఆగుతుందని కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో ఇది రెండో రైలన్నారు. గతంలో సికింద్రాబాద్-తిరుపతి రైలు నడుస్తుండగా ప్రస్తుతం విజయవాడ -చెన్నై రైలు రేణిగుంట మీదుగా నడుస్తుందని ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మాత్రమే ఈ రైలు ఆగుతుందని రైల్వే అధికారులు వివరించారు.

మహిళను రక్షించిన రైల్వే పోలీసులు

గిద్దలూరు రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో శనివారం ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోపోతుండగా రైల్వే పోలీసులు ఆమెను రక్షించారు. కుటుంబ సమస్యల కారణంగా ఆ మహిళ తన ఇద్దరు పిల్లలను తీసుకుని రైలు కిందపడేందుకు వచ్చింది. గూడ్స్ రైలు ప్లాట్ ఫాం నుంచి కదులుతుండగా ఆమె రైలు కిందపడబోయింది. ఆమెను గమనించిన పోలీసులు పక్కకు లాగి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

రోడ్డు పక్కన టీడీపీ జెండాలు



రోడ్డు పక్కన పడి ఉన్న టీడీపీ జెండాలు

మార్కాపురం: టీడీపీ పరిస్థితి దయనీయంగా మారుతోంది. స్కిల్ డెవలప్‌మెంటు కుంభకోణంలో అరెస్టు అయిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సెంట్రల్ జైలులో ఉండటంతో స్థానిక నేతలు కూడా తాజా పరిణామాలను గాలికొదిలేశారు. ఆ పార్టీ జెండాలు, చంద్రబాబునాయుడుతో ఉన్న పోస్టర్లు శనివారం కొనకనమిట్ల మండలం గొట్లగట్టు గ్రామ జంక్షన్ వద్ద (పొదిలి - కనిగిరి రాష్ట్ర రహదారి) కుప్పలుగా పడి ఉన్నాయి. ఇవి శనివారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. టీడీపీ దయనీయ స్థితిపై పలువురు ట్రోల్ చేశారు. జిల్లా, రాష్ట్ర నాయకులు.. స్థానిక నేతలను మందలించడంతో వారు వెళ్లి రోడ్డు పక్కన పడిఉన్న జెండాలను బస్తాల్లో వేసుకొని వెళ్లారు.

మిస్సింగ్ కేసు నమోదు



లేళ్లపల్లి శ్రీను (ఫైల్)

పొన్నలూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన లేళ్లపల్లి శ్రీను 21వ తేదీన గురువారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే రెండు రోజులైనా ఇంటికి రాకపోవడంతో బంధువులను, చుట్ట పక్కల గ్రామాల్లో విచారించిన కుటుంబ సభ్యులు శ్రీను ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి రాజారావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చిరికూరపాడు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం

జరుగుమల్లి: మండలంలోని చిరికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం డి.అనురాధ తెలిపారు. వీరు ఈ నెల 20న ఒంగోలులో జరిగిన జిల్లా స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో సత్తా చాటారన్నారు. ఎంపికైన వారిలో కె. జెస్సీ, యస్.కె భాను, ఆర్. దేవిక, ఏ. నవ్య ఉన్నారు. కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున పాల్గొంటారు. శిక్షణ ఇచ్చిన పీడీ మురళీ మోహన్‌ని పాఠశాల అభినందించారు.